క్లుప్తంగా

డైమండ్ బాబుకు అభినందనలు



పొన్నూరు: వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షుడిగా నియమితులైన నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు(డైమండ్ బాబు)కు వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అభినందనలు తెలిపారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో డైమండ్ బాబుకు మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ఇంచార్జ్) డి.శ్రీనివాస్ అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ (ఇన్‌చార్జి) ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. మొత్తం 34 ఫిర్యాదులు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 13, ఇంజినీరింగ్ విభాగం 11, రెవెన్యూ 3, ప్రజారోగ్య విభాగం 5, అకౌంట్స్ 1, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు వచ్చాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంహెచ్ఓ డాక్టర్ రవి, మేనేజర్ ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఆర్ఓలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతరు



నగరంలో ఓ భవన నిర్మాణానికి వాడుతున్న నగరపాలక సంస్థ వాటర్ ట్యాంకరు నీళ్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి దందాకు ఇంజినీరింగ్ అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఒక పక్క నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వాటర్ ట్యాంకులను భవన నిర్మాణాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. రోజుకు లక్షలాది లీటర్ల మంచినీరు అక్రమంగా ట్యాంకుల ద్వారా తరలించి భవన నిర్మాణాలకు, కమర్షియల్ పనులకు వినియోగించుకుంటూ వేల రూపాయలను తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాంకర్ల దోపిడీని అరికట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

లక్ష్మీపురం: గాజా పట్టణంపై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించి నేటికి సంవత్సరం పూర్తవుతుందని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, పాశం రామారావు అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న పాశవిక దాడులను వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక కింగ్ హోటల్ సెంటర్ ప్రధాన రహదారి వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ దినాన్ని పాటిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడతూ ఈ దాడిలో సుమారు 85 వేల మందికిపైగా మరణించారని ప్రముఖ మెడికల్ జర్నల్ 'లాన్సెట్' అంచనా వేసిందన్నారు. ఇజ్రాయిల్ భీకర కాల్పుల్లో పిల్లలు, మహిళలు, వృద్ధులు అధికంగా మరణించారని తెలిపారు. సత్వరమే ఈ యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) నాయకుడు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు వి.నరసింహారావు, ప్రజాపోరు నాయకుడు కోటేశ్వరరావు, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, కె.నళినీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను కొనసాగించాలి

లక్ష్మీపురం: అనేక సంవత్సరాలుగా వ్యాపారలావాదేవీలు నిర్వహిస్తూ, ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులు, వారి సహాయకులకు తక్కువ ధరలో తినుబండారాలను సప్లయి చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న వారి పొట్టకొట్టడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో చిరు వ్యాపారులు, ఏఐటీయూసీ సంఘం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దుపాటి వెంకటరత్నం, నరసింహారావు, చల్లా మరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

సి'ఫార్సు' బదిలీలు!



నగరపాలక సంస్థ కార్యాలయం

- సిఫార్సుల మేరకే నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు
- సీనియార్టీని కాదని జూనియర్లకు కీలక పోస్టులు
- ఎమ్మెల్యేలు చెప్పిన వారికి ఫోకల్ పోస్టుల్లో బాధ్యతలు కేటాయింపు
- ట్రాన్స్‌ఫర్లలో కీలక పాత్ర పోషించిన ద్వితీయ శ్రేణి అధికారి
- అంతర్గత బదిలీలపై పెదవి విరుస్తున్న కార్యాలయ సిబ్బంది

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేసే మినిస్టీరియల్ సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ బదిలీల్లో సీనియర్ల సీట్లల్లో జూనియర్లకు, జూనియర్ సీట్లలో సీనియర్లకు పోస్టులు ఇవ్వడంతో పాటు, ఫోకల్ పోస్టుల్లో పనిచేసిన వారికి తిరిగి అవే పోస్టుల్లో సీట్లు కేటాయించడంపై కార్యాలయంలోని కొంత మంది సిబ్బంది అంతర్గత బదిలీలపై పెదవి విరుస్తున్నారు.

ముందుగానే లీకైన బదిలీల వ్యవహారం..

నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీల వ్యవహారం గత 15 రోజుల పైబడి నడుస్తుంది. అయితే సోమ, బుధవారాల్లో బదిలీలకు సంబంధించిన ఫైల్ ఈ ఆఫీస్ నుంచి కింద స్థాయి అధికారులకు వెళ్లే క్రమంలో కింద స్థాయిలో సిబ్బంది ఒకరు సదరు ఫైల్‌ను ఓపెన్ చేసి బదిలీలకు సంబంధించిన పూర్తి వివరాలను కార్యాలయం మొత్తం ప్రచారం చేశారు. దీంతో బదిలీలు కాకముందే కార్యాలయం మొత్తం తమకు ఈ సీటు కేటాయించారు..ఆ సీటు కేటాయించారు అని చెప్పుకోవడంతో ఈ విషయం తెలుసుకున్న కమిషనర్ సదరు ఫైల్‌ను వెనక్కి తెప్పించుకుని మరలా బదిలీలల్లో కొన్ని మార్పులు చేసేందుకు కసరత్తు మొదలు పెట్టినట్లు తెలిసింది.

ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకే బదిలీలు

బదిలీలల్లో మార్పులు జరుగుతున్నాయని తెలుసుకున్న కొంతమంది ఉద్యోగులు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్లి తమకు కావాల్సిన సీటు విషయమై మంతనాలు చేయించారు. ఈ విషయంలో కార్యాలయంలోని ఓ ద్వితీయ శ్రేణి అధికారి కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. సదరు అధికారి ఎవరైతే ఫోకల్ పోస్టుల్లో సీటు కావాలని ఆశిస్తున్నారో..వారి నుంచి భారీ స్థాయిలో నగదు తీసుకుని పోస్టింగ్‌లో కీలకంగా వ్యవహరించినట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. సదరు పోస్టులకే ఎమ్మెల్యేల ద్వారా సిఫార్సులు చేయించడంతో అనుకున్న వారికి అనుకున్న విధంగా సీట్లు కేటాయించినట్లు తెలుస్తుంది. గుంటూరు నగరానికి చెందిన ఓ ఎమ్మెల్యే కమిషనర్ కార్యాలయానికి రాత్రి వేళ వచ్చి దగ్గరుండి తమ వారికి ఫోకల్ పోస్టుల్లో పోస్టింగ్ ఇవ్వాలని కమిషనర్‌తో మంతనాలు జరిపినట్లు కార్యాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. స్వయంగా ఎమ్మెల్యే వచ్చి సిఫార్సు చేయడంతో పాటు, మరో ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు ఇచ్చిన తరువాత శనివారం అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో జూనియర్లకు పోస్టింగ్

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), ఆర్వో(రెవెన్యూ ఆఫీసర్), ఇతర ఫోకల్ పోస్టుల్లో తమ అనుకున్న వారు జూనియర్లు అయినప్పటికీ సీనియర్ పోస్టుల్లో కూర్చోబెట్టారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో జూనియర్ అసిస్టెంట్లకు స్థాన చలనం కల్పించారు. దీంతో చాలా మంది ఉద్యోగులు ఈ అంతర్గత బదిలీపై చిర్రుబుర్రులాడుతున్నారు. సీనియార్టీని కాదని జూనియర్లుకు కీలక పోస్టులు కేటాయించడం కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

కింగ్‌డమ్ చర్చిలో ఉచిత వైద్యశిబిరం



మహిళకు మందులు అందజేస్తున్న డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు మెడికల్: గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పాత గుంటూరు క్రిస్టియన్ పేటలో ఉన్న కింగ్‌డమ్ చర్చిలో హోప్ విన్ హాస్పిటల్స్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్ హాస్పిటల్స్ చైర్మన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఉమెన్స్ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమా సుల్తానా వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు మందులు ఉచితంగా అందజేశారు. డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించాలన్న లక్ష్యంతో హోప్‌విన్ హాస్పిటల్స్ రూ.10కే ఓపీని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని హోప్ విన్ హాస్పిటల్స్‌లో ఉన్న అన్ని రకాల వైద్య సేవలను అతి తక్కువ ఖర్చుతో పొందాలని సూచించారు. కింగ్‌డమ్ చర్చి పాస్టర్ రెవరెండ్ డీఎస్‌సీ ఫిన్నీ మాట్లాడుతూ హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజర్ పి. నాగేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఏసీఈ యోబు మృతి



ఏసీఈ ఎన్.యోబు (ఫైల్)

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏసీఈ (అడిషినల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్) నంబూరు యోబు(61) సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. అస్వస్థతకు గురికావడంతో సోమవారం యోబును కుటుంబ సభ్యులు తాడేపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో ఆయన ఆస్పత్రిలోనే మృతి చెందారు. డిప్యూటీ రిజిస్ట్రార్ కేడర్‌లో ఉన్న యోబు పదిహేను రోజుల క్రితం ఏసీఈగా చార్జ్ తీసుకున్నారు. యూనివర్సిటీలో ఉద్యోగిగా పలు హోదాల్లో విధులు నిర్వహించిన ఆయన యూనివర్సిటీ అధ్యాపకేతర సిబ్బంది సంఘం 'వికాస'లో సుదీర్ఘకాలం పదవులు నిర్వహించి ఉద్యోగులు, యూనివర్సిటీ వర్గాల మన్ననలు పొందారు. ఆయన మృతిపై వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, యూనివర్సిటీ ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు, పరిశోధకులు విచారం వ్యక్తం చేశారు. యూనివర్సిటీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

13న సంగీత మలేకర్ సినీసంగీత విభావరి



గాయకురాలు సంగీత మలేకర్

నగరంపాలెం: కళాదర్బార్ 49వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ హిందీ గాయకురాలు సంగీత మలేకర్ సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేట లోని సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13 సాయంత్రం 5 గంటలకు గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ విభావరి జరగనుందని తెలిపారు. ప్రపంచ దేశాల్లో పేరు ప్రఖ్యాతలు ఉన్న సంగీతమలేకర్‌తోపాటు ప్రముఖ గాయకులు మురళీకృష్ణ, రాందాస్, షాన్‌వాజు, శివకుమార్, శైలజ, అనుషా, ఇందునైన, పావని తదితరులు గీతాలు ఆలపించనున్నారని అన్నారు. ఆరోజు ఉదయం ప్రవేశ కార్డులను శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పొందవచ్చునని ఆయన తెలిపారు.

నూరిఫాతిమాను కలిసిన డైమండ్‌బాబు



నెహ్రూనగర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడిగా నియమితులైన డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) సోమవారం పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమాను మంగళదాస్‌నగర్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

సింగిల్ నెంబర్ లాటరీ నిర్వాహకుడు అరెస్ట్

పట్నంబజారు: సింగిల్ నెంబర్ లాటరీ నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరువారి తోటలోని స్వర్ణాంధ్ర హోటల్ వద్ద సింగిల్ నెంబర్ లాటరీ ఆటో నిర్వహిస్తున్న బ్రహ్మారెడ్డి అనే వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.ఏడు వేల నగదు, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

ఏసీకి చిరువ్యాపారుల వినతి

నెహ్రూనగర్: జీజీహెచ్ పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ దుకాణాలను నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు శనివారం అర్ధంతరంగా తీసివేశారని, దీంతో తమ జీవనధారం ఆగమ్యగోచరంగా మారిందని నగర అదనపు కమిషనర్(ఏసీ) డి.శ్రీనివాస్‌కు చిరువ్యాపారులు సోమవారం కౌన్సిల్ హాల్‌లో వినతిపత్రం అందజేశారు. తిరిగి షాపులను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తానని అదనపు కమిషనర్ చెప్పారని చిరువ్యాపారులు తెలియజేశారు.

నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు

- అలా లేకుంటే ఓసీ జారీచేయబోం
- నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు



భవన నిర్మాణ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రైనేజీ లైన్‌ని మేజర్ డ్రైన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కోదండరామయ్య నగర్, గోరంట్ల, పెద్ద పలకలూరు రోడ్, కాకాని రోడ్, ఆర్టీసీ కాలని తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లు, డ్రైన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవనాలు నిర్మాణ దశలో వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆర్టీసి కాలనిలో డ్రైన్‌ని ఆక్రమించి ర్యాంప్‌లు చేసిన నిర్మాణం గమనించి సంబంధిత ప్లానింగ్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలు లేదన్నారు. ర్యాంప్‌లు రోడ్ మీదవరకు రాకూడదని, గ్రీనరీకి కేటాయించిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్టుమెంట్ నిర్వాహకులే డ్రైనేజీ లైన్‌ను మేజర్ డ్రైన్ వరకు కనెక్ట్ చేసుకోవాలన్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ డి.రాంబాబు, టీపీఎస్‌లు లక్ష్మణ స్వామి, సువర్ణ కుమార్, రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు ఉన్నారు.

జీజీహెచ్ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత



ఆసుపత్రిలో పరిసరాలు శుభ్రం చేస్తున్న డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద సుందరీకరణ కోసం ప్రత్యేక పూజలతో శంకుస్థాపన చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆస్పత్రి లోపల గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండటం వలన వైద్యులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇటీవల వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆసుపత్రిలోనికి కేవలం రోగులు, వారి సహాయకులను మాత్రమే అనుమతించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేసేందుకు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రి గోడలను నీళ్లతో కడిగి పరిశుభ్రం చేశారు. ఎలాంటి దుర్గంధ పూరితమైన వాతవరణం లేకుండా సుందరీకరణ చేస్తున్నామని చెప్పారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పారిశుద్ధ్య నిర్వహణ, సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఆస్పత్రిలో పార్కింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోయి ప్రమాదాలు అధికమవుతున్నాయని, భవిష్యత్తులో ట్రాఫిక్ కష్టాలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు నగర అదనపు కమిషనర్(ఇన్‌ఛార్జ్) డి.శ్రీనివాస్‌కు విన్నవించారు. ఈ మేరకు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల మీద ఆక్రమణలు పెరిగిపోవడం, ఆటోలు, సిటీ బస్సులు క్రమం లేకుండా ఎక్కడబడితే అక్కడ ఆపడం వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. అంతేకాకుండా మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతూ యాక్సిడెంట్లు చేస్తున్నారని వాపోయారు. నగరంలో సీసీ కెమెరాల పటిష్టమైన నిఘా లేకపోవడం వలన ట్రాఫిక్ సమస్య, ఇతర సమస్యలు పెరిగిపోతున్నాయని...సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెంచాలని కోరారు. జీఆర్ భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, నల్లపు నీలాంబరం ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు నగరంలోని నల్లచెరువు విద్యుత్ కార్యాలయం పరిధిలో ఎమర్జెన్సీ మరమ్మతుల దృష్ట్యా సంపత్‌నగర్, కొబ్బరితోట, నల్లచెరువు 7, 8, 9 లైన్లు, పార్వతీపురం, అడపాబజార్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్ శాఖ ఏఈ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనతో తెలిపారు.

రాష్ట్రస్థాయి డెకాథ్లాన్‌లో సత్తా చాటిన మునీర్



విద్యార్థి మునీర్‌ను అభినందిస్తున్న రామకృష్ణమూర్తి, నర్సిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా డెకాథ్లాన్ ఈవెంట్‌లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి షేక్ మునీర్ తృతీయస్థానంలో నిలిచినట్లు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. సోమవారం అమరావతిరోడ్డులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఈనెల 4,5,6వ తేదీల్లో జరిగిన 37వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా అండర్–20 బాలుర విభాగంలో తమ విద్యార్థి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. విద్యార్థి మునీర్‌కు భవిష్యత్తులో క్రీడల్లో ముందుకెళ్లేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరి రవి పాల్గొన్నారు.

మహా కనకదుర్గా.. విజయ కనకదుర్గా!



ఆర్.అగ్రహారం కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో గాయత్రీదేవీ అలంకారం



కొత్తపేట జగన్నాథస్వామి దేవస్థానంలో రుక్మిణి దేవిగా..




లాలాపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధైర్యలక్ష్మీదేవిగా..



సంగడిగుంట రెడ్లబజార్ కనకదుర్గ దేవస్థానంలో చండీదేవిగా..



కొత్తపేట పెద్దమహాలక్ష్మమ్మ దేవస్థానంలో పుష్పశయ్య అలంకారం



కొత్తపేట భద్రావతి సమేత భావనా రుషి దేవస్థానంలో గాయత్రీదేవిగా..

నగరంలో దేవీశరన్నవరాత్రులు సోమవారానికి అయిదో రోజుకి చేరాయి. ఉదయం నుంచి విశేష పూజలను వేదపండితులు నిర్వహించారు. ప్రత్యేక అలంకారాలతో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

– నగరంపాలెం

నవదుర్గలుగా అలరించిన విద్యార్థినులు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం ముందస్తు దసరా వేడుకలతో పాటు బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు నవదుర్గల వేషధారణలో మహిషాసుర మర్దని రూపకాన్ని ప్రదర్శించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ సంస్కృతిలో మహిళకు అత్యంత గౌరవాన్ని, సముచితమైన స్థానాన్ని ఇవ్వడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని, దీనిని దసరా ఉత్సవాలు ప్రతిబింబిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు ప్రతీకగా నవదుర్గల వేషధారణతో పాటు తెలంగాణాలో జరుపుకునే బతుకమ్మ ఉత్సవాలను జరుపుకోవడం మెచ్చుకోదగిన విషయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ వైష్ణవి, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వేదవతి, ఏ.బాజీబాబు, ఎస్.మణికంఠ, పి.శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

బోరు పంపునకు మోక్షం ఎప్పుడో!



నెహ్రూనగర్: నెహ్రూనగర్ ఎదురుగా ఉండే బుచ్చయ్యతోట 5వ లైనులో బోర్ పంపు పాడై రోజులు గడుస్తున్నప్పటికీ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. బుచ్చయ్యతోటలో ఉండే స్థానికులు ఈ బోర్ పంపును వినియోగిస్తుంటారు. ఈ మధ్య కాలంలో అది రిపేర్‌కు రావడంతో స్థానికులు ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే నగరపాలక సంస్థ సిబ్బంది దానిని బాగుచేయిస్తామని తీసుకువెళ్లి అలాగే వదిలేశారు. బోర్ పంపును తిరిగి ఎప్పుడు బిగిస్తారో అని అధికారులను అడిగినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మిన్నకుండిపోయారు. అధికారులు స్పందించి బోరింగ్ పంపు రిపేర్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.